

పుట్టగొడుగుల పెంపకం యూనిట్లు స్థాపించాలి

ఉండి: పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చి వారిని వ్యాపారవేత్తలుగా ప్రోత్సహించి పుట్టగొడుగుల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేయాలని గోదావరి మండలి సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. వ్యవసాయ పరిశోధనా మండలి 95 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావుఅధ్యక్షతన నిర్వహిస్తున్న పుట్టగొడుగుల పెంపకంపై రెండో రోజు సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో భరత లక్ష్మి పాల్గొని మాట్లాడారు. పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కానీ శిక్షణతో శాస్త్రవేత్తల బాధ్యత పూర్తి కాదని వ్యాపారవేత్తలుగా ఎదగడానికి వారికి కావాల్సిన సదుపాయాలను ఏర్పాటు చేసి పుట్టగొడుగుల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేసేలా వారిని ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని సేంద్రియ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల తయారీదారులందర్నీ పిలిచి ఒక సంఘంగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్.డెబోరా మెస్సియానా, ఎ.శ్రీనివాస్, ఎ.రాజేష్, పి.వినయ లక్ష్మి పాల్గొన్నారు.

సాగుకు ఆటంకాలెన్నో..!

200 ఎకరాలకు పొంచి ఉన్న ముంపు – రైతుల ఆందోళన

ప్రజాశక్తి – వీరవాసరం

మండలంలో చింతల కోటిగరువు తూర్పుకాలువ శివారు వీరవల్లిపాలెం, నడపనవారిపాలెం గ్రామాల ఆయకట్టులో సాగుకు ఎదురవుతున్న ఆటంకాలను తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఈ ఆటంకాల విషయాన్ని రైతులు డ్రెయినేజీ అధికారి దృష్టికి తీసుకెళ్లడంతో ఎఇ వివి.వెంకటరమణ శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రస్తుతం నిధుల కొరత ఉందని రైతులకు ఎదురవుతున్న సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో సుమారు రెండు వందల ఎకరాలకు ముంపు పొంచి ఉందని రైతులు చెబుతున్నారు. ఈ కాలువ ద్వారానే సాగు, మురుగునీరు ప్రవహించి సమీపంలోని గొంతేరు డ్రెయిన్‌లో కలుస్తుంది. అయితే



నడపనవారిపాలెంలో అసంపూర్తిగా ఉన్న డ్యాం

కాలువ గొంతేరు డ్రెయిన్లో కలిసే ప్రాంతంలో ఉన్న తూరలు

కుంగిపోవడంతో కాలువ ఎగువ నుండి వచ్చే నీరు డ్రెయిన్‌లోకి వెళ్లే పరిస్థితి లేదు. దీంతో పంట చేలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలువ నిర్మించిన పైన ఉన్న డ్యాం నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడంతో సాగుకు ఆటంకం ఏర్పడుతుందని రైతులు తెలిపారు. కాలువ నీరు తక్కువ వస్తున్నప్పుడు ఇసుక బస్తాలు వేసి అడ్డుకట్టు వేసుకోవాల్సి వస్తోందని, అధికంగా వస్తున్నప్పుడు బస్తాలను తొలగించుకోవాల్సి రావడం ఇబ్బందిగా మారుతోందని తెలిపారు. దీనికితోడు కాలువ శివారున తూరలు కుంగిపోవడంతో మరో ఇబ్బంది ఏర్పడిందన్నారు. ప్రస్తుతం సార్వా నారుమడులు వేసుకుంటున్నామని, వర్షాలు అధికంగా వస్తే నీరు డ్రెయిన్‌లోకి వెళ్లకపోతే చేల వెంబడి పొంగి నారుమడులు ముంపునకు గురవుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను తక్షణం పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



ప్రజల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి – భీమవరం

స్పందనలో వచ్చిన ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి తమ సమస్యల పరిష్కారానికి వచ్చిన ప్రజల నుంచి 269 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించేలా జిల్లా, మండలస్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఓ కె.కృష్ణవేణి, జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు, జిఎస్‌డబ్ల్యూఒ కెసిహెచ్.అప్పారావు, డిఎస్‌పి బి.శ్రీనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయో వృద్ధుల ట్రిబ్యునల్ మెంబరు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సాగునీరందించకపోవడం సిగ్గుచేటు

నీరివ్వకపోతే పొలాల్లో కూర్చుంటా

మొగల్లు రైతుల ధర్నాలో ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి – పాలకోడేరు

రోజులు గడుస్తున్నా పంట పొలాలకు సాగునీరు అందించకపోవడం సిగ్గుచేటని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు విమర్శించారు. రైతులకు సాగునీరు అందించని పక్షంలో రైతులతో పంట పొలాల్లోనే కూర్చొని ధర్నా చేస్తానని హెచ్చరించారు. మొగల్లు శివారుతోపాటు గుత్తులవారిపాలేనికి చెందిన పొలాలకు నీరందకపోవడంతో నేటికీ రైతులు నారుమడులు వేసుకోలేదని టిడిపి నేతలు ఎంఎల్ఎ రామరాజు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. అనంతరం రైతులతో కలిసి మొగల్లు శివార్లలో దక్షిణ పంట కాలువ వద్ద రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా లక్ష్మీనారాయణపురం నుంచి మొగల్లు వరకు ఏడు కిలోమీటర్ల మేర ఉన్న పంట కాలువను తవ్వకపోవడం వల్లే రైతులకు ఇబ్బంది వచ్చిందన్నారు. అధికారులు కూడా ఈ పంట కాలువలపై దృష్టి సారించకపోవడంపై రైతులకు ఇన్ని ఇబ్బందులు వచ్చాయన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామరాజు

ఇప్పటికే నాట్లు వేసుకోవాల్సి ఉండగా నారుమడులు కూడా వేయలేదని ఇరిగేషన్ డిఇ శ్రీనివాస్, ఎఇ అనిల్‌పై ఎంఎల్ఎ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సాగునీరు అందించని పక్షంలో ఇకపై పొలంలోనే కూర్చుంటానని అన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కాలువను తవ్వించాలని సూచించారు. ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడు సాలా మల్లేశ్వరరావు, దెందుకూరి కోటిరాజు, మధువర్మ, సాగిరాజు మధు, సంకురుడు, పెన్మెత్స శివరామరాజు, మాజీ ఎంపిటిసి శ్రీను, నడిపూడి అప్పారావు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి

నారుమళ్లకు పూర్తిస్థాయిలో సాగునీరు

ఇరిగేషన్ అధికారులకు జెసి ఆదేశం

ప్రజాశక్తి – భీమవరం

శివారు పొలాల నారుమళ్లకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేలా ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఖరీఫ్ సాగుపై జల వనరులు, వ్యవసాయ శాఖాధికారులతో ఆయన సమీక్షించారు. శివారు భూముల నారుమళ్లకు నీటి విడుదలను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గుర్రపుడెక్క, తూడు ఎప్పటికప్పుడు తొలగించి నీటిపారుదలకు ఆటంకాలు తలెత్తకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 25 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని, ఆగస్టు 15లోపుగా నూరుశాతం నాట్లు పూర్తయ్యేలా వ్యవసాయాధికారులు రైతులను సమాయత్తపర్చాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఇఇ డ్రెయిన్లు ఎం.దక్షిణామూర్తి, ఇన్‌ఛార్జి జిల్లా జలవనరుల శాఖాధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎఇలు, వ్యవసాయ శాఖ ఎంఇఒలు పాల్గొన్నారు.

స్పందనకు 17 ఫిర్యాదులు

ప్రజాశక్తి – భీమవరం రూరల్

స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 17 ఫిర్యాదులు అందినట్లు జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ తెలిపారు. ఎస్‌పితోపాటు అడిషనల్ ఎస్‌పి అల్లూరి సుబ్బరాజు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జనంతో స్వయంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులపై ఆయా మండల, పట్టణ పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులను పంపించి వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నేతలు

మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వాసు

వడివడిగా సాగిన విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర

ప్రజాశక్తి – పాలకోడేరు

మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర ఎనిమిదో రోజుకు చేరింది. దీనిలో భాగంగా ఉండి మండలం యండగండిలో సోమవారం ప్రారంభమైన ఈ యాత్ర పాలకోడేరు మండలం గొల్లలకోడేరు, పాలకోడేరు, వేంద్ర గ్రామాల మీదుగా సాగింది. అనేక ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను సైకిల్ యాత్ర బృందం సందర్శించింది. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నేతలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చాలామంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినడం లేదన్నారు. ఇంటి వద్ద నుండి క్యారేజీలు తెచ్చుకుంటున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్న చైతన్య గోదావరి సంస్థ నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందజేయకపోవడమే దీనికి కారణమన్నారు. భోజనం నాణ్యత లేకపోవడం వల్ల ప్రతి పాఠశాలలో వంద మందిలో 30 నుంచి 40 మంది భోజనం చేయడం లేదని తెలిపారు. కొన్ని వేల మందికి ఒకే చోట భోజనం వండటం వల్ల భోజనంలో నాణ్యత తగ్గుతుందని ఆరోపించారు. భోజనం తయారు చేస్తున్న సంస్థకు కాంట్రాక్ట్ రద్దు చేసి పాఠశాలలోనే వండి పెట్టే పద్ధతిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీనివల్ల విద్యార్థులకు నాణ్యమైన, వేడి భోజనం అందుతుందని అన్నారు. ఈ యాత్రలో రాష్ట్ర సహాయ కార్యదర్శి పావని, జిల్లా కమిటీ సభ్యులు జి.ధనుష్, పి.నాగేంద్ర, శ్రీనివాస్, కె.గణేష్, చిరంజీవి, నాని పాల్గొన్నారు.

పిఆర్‌సి, డిఎ అరియర్స్ చెల్లించాలి

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జేమ్స్

ప్రజాశక్తి – భీమవరం

పిఆర్‌సి, కరువుభత్యం అరియర్లు, పెన్షనర్లకు వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్ అన్నారు. స్థానిక యుటిఎఫ్ భవనంలో జిల్లా ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి జేమ్స్ అధ్యక్షత వహించారు. భీమవరం, పాలకొల్లు, ఆకివీడు, నరసాపురం, అత్తిలి, గణపవరం, పెనుగొండ యూనిట్‌ల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. కార్యదర్శి డాక్టర్ సాగిరాజు సత్యనారాయణరాజు, కోశాధికారి రవిప్రసాద్ నివేదికలు ప్రవేశపెట్టారు. అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రతాప్‌రాజు తీర్మానాలు ప్రవేశపెట్టగా ఆమోదించారు. ప్రతినెలా ఒకటో తేదీనే



మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జేమ్స్

పెన్షన్లు జమ చేయాలని, పే రివిజన్ కరువు భత్యం, బకాయిలు ఒకేసారి చెల్లించాలని, పెండింగులో ఉన్న డిఎలు విడుదల చేయాలని, 11వ పిఆర్‌సిలో కుదించిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ ఇంతకుముందు మాదిరిగానే చెల్లించాలని తీర్మానించారు. రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల్లో ఇహెచ్‌ఎస్ కార్డుల ద్వారా వైద్యం అందేలా చూడాలని, సర్వీస్ పెన్షనర్ భార్యగాని, భర్తగాని చనిపోతే ఫ్యూనరల్ ఛార్జీలు గతం మాదిరిగా చెల్లించాలని, ఫ్యామిలీ పెన్షనర్ పుట్టిన తేదీ ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని, కమ్యుటేషన్ ఆఫ్ పెన్షన్ రికవరీ 12 సంవత్సరాలకు పరిమితం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశం తీర్మానించింది. సమావేశంలో జోబాబు, గోపాల కృష్ణమూర్తి, వియస్.అప్పారావు, నరసింహరావు, ప్రతాపరాజు, రెడ్డి, పివి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించి ఫలితాలు రాబట్టాలి

జెసి రామ్ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి – భీమవరం

నిర్దేశించిన లక్ష్యాలు సకాలంలో పూర్తిచేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ నుంచి రీసర్వే, జగనన్న సురక్ష, వాటర్ టాక్స్, స్పందన పిటీషన్లు, టూరిజం ప్రాజెక్టులు, సిసిఆర్‌సి కార్డులు, తదితర అంశాలపై జిల్లా జాయింట్ కలెక్టరు మండల ప్రత్యేకాధికారులు, అధికారులు, సర్వేయర్లులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మండలాల వారీగా గ్రామాల ప్రగతిని తెలుసుకున్నారు. లోటు ఉన్న మండలాలపై జెసి అసహనం వ్యక్తం చేశారు. జగనన్న సురక్ష అన్ని మండలాల్లో ఎలా జరుగుతోందని అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ధ్రువపత్రాలు ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత బాగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ఒఆర్‌ఐలు వచ్చిన గ్రామాల్లో రీసర్వే వేగవంతంగా జరగాలని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి రైతుకూ నోటీసు అందజేయాలని వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని తహాశీల్దార్లు, మండల సర్వేయర్లను ఆదేశించారు. స్పందనలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకూ శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. మరలా అదే ఫిర్యాదు స్పందనలో వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల స్థలాల కోసం జిల్లా స్పందనకు అర్జీలు వస్తున్నాయని ఇటువంటివి మండల స్థాయిలోనే పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ కె.కృష్ణ వేణి, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, అధికారులు పాల్గొన్నారు.



బియ్యం ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ధరల పెరుగుదలకు కారణం కేంద్రం : మంత్రి కొట్టు

గూడెంలో బియ్యం ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

ధరల పెరుగుదలకు పూర్తి బాధ్యత కేంద్రానిదే అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఏర్పాటుచేసిన బియ్యం ప్రత్యేక కౌంటర్‌ను మంత్రి కొట్టు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరల అంశం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనిది కానప్పటికీ ప్రతి ఒక్కరికీ నిత్యం అవసరమైన బియ్యం, కందిపప్పు ధరలను నియంత్రించడంలో తమ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతిపక్షాలు ధరలు పెరిగిపోయాయని దుష్ప్రచారం చేస్తున్నాయని, అయితే ఇది కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉందనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. రైతులు పండించిన పంటలకు కేంద్రం మద్దతు ధర నిర్ణయిస్తుందన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. ఆ ధాన్యాన్ని రైస్ మిల్లులకు ఇచ్చి సిఎంఆర్ విధానంలో బియ్యం తీసుకుంటుందన్నారు. ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయడం వల్ల రైతులకు మద్దతు ధర లభించి దళారి వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడం జరిగిందన్నారు. ఎఎన్ రోడ్డును వైఎస్ఆర్ మార్గ్‌గా పేరు మార్చినందున మెయిన్ రోడ్డులోని వ్యాపారులు వారి బోర్డులపై వైఎస్ఆర్ మార్గ్‌గా పేరు మార్చుకోవాలని సూచించారు. చిలకంపాడు లాకులు నుంచి వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ వరకూ రూ.45 కోట్లతో నాలుగు లైన్లు రహదారిగా అభివృద్ధి చేశామన్నారు. అలాగే బాదంపూడి నుంచి ప్రత్తిపాడు సాక్షి ఆఫీస్ వరకూ కూడా రూ.10 కోట్లతో రోడ్డును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఛాంబర్ అధ్యక్షులు ఈతకోట తాతాజీ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలకు ఛాంబర్ అండదండలు ఎప్పుడూ ఉంటాయన్నారు. సివిల్ సప్లయిస్ డిఎం టి.శివరామ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్ల ద్వారా తగ్గింపు ధరలకు బియ్యం అందజేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, ఛాంబర్ ఉపాధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ, కార్యదర్శి రవి అగర్వాల్, జాయింట్ సెక్రటరీ సత్తి జగన్మోహనరావు, కోశాధికారి నాగేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

20 నుంచి మున్సిపల్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, సిపిఎస్ విధానం రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500 కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ ఈ నెల 20 నుండి రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీ ఆందోళనలు చేపట్టాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కర్రి నాగేశ్వరరావు, ధనాల వెంకట్రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 20, 21 తేదీల్లో మున్సిపల్ కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తారని, 27న మున్సిపల్ కార్యాలయాల ముట్టడి నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆగస్టు ఏడో తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాలు వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. మున్సిపల్ కార్మికులకు ఇవ్వాల్సిన హెల్త్ అలవెన్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ సదుపాయాలను కల్పించాలని కోరారు.

గోదావరి జిల్లాల్లో నీటి కాలుష్య భూతం

మరో పదేళ్లలో రోజూ ఆస్పత్రికి వెళ్లాలి

ప్రముఖ వైద్యులు డాక్టర్ బాబ్జీ హెచ్చరిక

ప్రజాశక్తి – పాలకొల్లు

గోదావరి జిల్లాల్లో తాగునీటి కాలుష్యం బాగా పెరిగిందని, వచ్చే పదేళ్లలో ప్రతిఒక్కరూ రోజూ ఆసుపత్రికి వెళ్లాల్సిన దుస్థితి వచ్చే ప్రమాదం ఉందని ప్రముఖ వైద్యులు, మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జి హెచ్చరించారు. ఆదివారం రాత్రి రోటరీ క్లబ్ సభ్యుల ప్రమాణస్వీకారానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ కేవలం ప్రభుత్వాలు ఒక్కటే ఏమి చేయలేవని రోటరీ, లయన్స్ వంటి సంస్థలు ముందుకొచ్చి నీటి కాలుష్యం బారినుంచి కాపాడాలని కోరారు. ఇప్పటికే జిల్లాలో నీటి కాలుష్యంతో డయాలిసిస్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయని హెచ్చరించారు. యువతలో చెడు అలవాట్లు బాగా పెరిగాయని చెప్పారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పోలియో నివారణకు రోటరీ చేస్తున్న సేవలను కొనియాడారు. రోటరీ క్లబ్ నూతన అధ్యక్షునిగా పెనుమాక రామ్మోహన్, కార్యదర్శిగా రావాడ సతీష్, కోశాధికారిగా ముత్యాల బాధ్యతలు చేపట్టారు. వీరిని పలు సంఘాలు ఘనంగా సత్కరించాయి.

సచివాలయ భవన నిర్మాణం అద్భుతం

విస్సాకోడేరు సర్పంచి బొల్ల శ్రీనివాస్‌కు

రాష్ట్ర పంచాయతీ రాజ్ చీఫ్ బాలునాయక్ అభినందన

ప్రజాశక్తి – పాలకోడేరు

విస్సాకోడేరు సచివాలయ భవనాన్ని అద్భుతంగా అన్ని హంగులతో తీర్చిదిద్దారని రాష్ట్ర పంచాయతీరాజ్ చీఫ్ బాలునాయక్ అన్నారు. స్థానిక రావిచెట్టు సెంటర్లో సర్పంచి బొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ చీఫ్ బాలునాయక్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ భవనాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దిన సర్పంచి శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం స్థానిక సచివాలయంలో జిల్లాలోని పంచాయతీరాజ్ అధికారులతో సచివాలయ భవన నిర్మాణాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్మిస్తున్న సచివాలయ భవనాలతోపాటు ఆర్‌బికె కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోపు భవన నిర్మాణాలన్నీ పూర్తి చేయాలన్నారు. సచివాలయం బిల్లులు ప్రతినెలా రెండుసార్లు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని సూచించారు. సమావేశంలో జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.



సర్పంచి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్ చీఫ్ బాలు నాయక్



మాట్లాడుతున్న సర్పంచి గూడూరి దేవేంద్రుడు

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై త్వరలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - పెనుమంట్ర

స్వచ్ఛ సర్వేక్షణ్ (గ్రామీణ్) లక్ష్యాలపై త్వరలో కేంద్ర బృందం పర్యటించనుందని, దీనిపై ఆయా శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని మాముడూరు సర్పంచి గూడూరి దేవేంద్రుడు అన్నారు. సోమవారం స్థానిక సచివాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ (గ్రామీణ్) లక్ష్యాలు-2023పై ఆయా శాఖల సిబ్బందికి పంచాయతీ కార్యదర్శి ఎన్‌వివి.సూర్యనారాయణరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దేవేంద్రుడు మాట్లాడుతూ గ్రామంలో జరిగే ఒడిఎఫ్ ప్లస్ గుర్తింపు పొందడం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు కోసం క్షేత్రస్థాయిలో కేంద్ర బృందం పరిశీలించనుందని తెలిపారు. ప్రతి శాఖ పని తీరును బృందం పరిశీలించి రాబోయే కాలంలో గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వాసంశెట్టి కిరణ్‌కుమార్, వైసిపి గ్రామాధ్యక్షుడు చంటి రాజు పాల్గొన్నారు.

సర్వే బృందాలకు సహకరించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఫీవర్ సర్వే బృందాలకు ప్రజలు సహకరించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణ్‌రావు తెలిపారు. సోమవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం పిహెచ్‌సి పరిధిలోని కొండ్రుప్రోలులో 50వ విడత ఫీవర్ సర్వే, వెక్టర్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా సిబ్బంది పలు సూచనలు చేశారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని, అందుకు అందరూ సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య కార్యదర్శి ఎల్.మహేశ్వరి, ఆరోగ్య సహాయకులు ఇ.శాంతారావు, పి.వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పి నౌషాద్, ఆశాలు వీరలక్ష్మి, కల్యాణి, వాలంటీర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.



యాత్రలో పాల్గొన్న ఎంఎల్‌ఎ నిమ్మల, నేతలు

కొనసాగిన టిడిపి బస్సు యాత్ర

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని శివదేవునిచిక్కాల, దగ్గులూరు, లంకలకోడేరు మీదుగా భవిష్యత్తు గ్యారెంటీ బస్సు యాత్ర కొనసాగింది. ఈ యాత్రలో భాగంగా దగ్గులూరులో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు సందర్శించి మాట్లాడారు. ఈ కాలేజీకి శంకుస్థాపన చేసి మూడున్నర ఏళ్లయినా ఇప్పటికీ కనీసం మట్టి కూడా పూడ్చలేదన్నారు. అసలు కాలేజీ నిర్మాణ పనులకు, జగన్ చెబుతున్న మాటలకు పొంతనలేదన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే కాలేజీ నిర్మాణ పనులు వేగవంతం చేసి పూర్తి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చినరాజప్ప, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ రావు, కోడి విజయభాస్కరరావు, కర్నేన గౌరు నాయుడు, చిట్టూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లులో టిడిపి బస్సు యాత్రలో భాగంగా సోమవారం సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పూలపల్లి వైజంక్షన్, దొడ్డిపట్ల వైజంక్షన్, బ్రాడీపేట నుంచి ప్రారంభమైన ర్యాలీ సభా వేదికకు చేరింది. బస్సు యాత్ర పట్టణంలో కొత్త ఉత్సాహం నింపింది. ఒక పక్క నియోజకవర్గంలోని సమస్యలను సెల్ఫీ తీస్తూ సిఎం జగన్ పంపి ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఛాలెంజ్ విసిరారు.

రోటరీ క్లబ్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రపంచ వ్యాప్తంగా రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు మరువలేనివని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి, పాలకొల్లు నూతన సభ్యుల ప్రమాణస్వీకారం సోమవారం జరిగింది. నూతన అధ్యక్షుడిగా కుంపట్ల రాంగోపాల్, సెక్రటరీగా తెలనాకుల కిషోర్ గుప్తా, కోశాధికారిగా శిరిగినీడి రాంబాబు ప్రమాణ స్వీకారం చేశారు. వారిచేత డిస్ట్రిక్ గవర్నర్ రావూరి సుబ్బారావు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ చేగొండి సూర్య ప్రకాష్, ముచ్చర్ల సంజయ్, పెనుమాక రామ్మోహన్ పాల్గొన్నారు.

వాసవీ మాతకు ఆషాడం సారె

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని వాసవీ మాతకు అత్యంత వైభవంగా సారే సమర్పించామని ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు తెలిపారు. తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి క్షేత్రంలో అమ్మవారికి ఆషాడం సారె సమర్పించారు. వందలాది మంది ఆర్యవైశ్య మహిళలు బాల బాలికలు పసుపు కుంకుమలు, పండ్లు, పిండి వంటలతో బాణాసంచా నడుమ అమ్మవారి ఊరేగింపు కొనసాగింది. అనంతరం సుమారు 1200 మంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రపంచ జనాభా దినోత్సవం ముగింపు కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ వైద్య అధికారుల పర్యవేక్షణలో డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాలీ, ప్రతిజ్ఞ, విద్యార్థులకు ప్రభుత్వ ప్రశంసాపత్రాలు అందజేశారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ భానునాయక్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో కాలంతోపాటు జనాభా కూడా పెరుగుతోందన్నారు. నిర్లక్ష్యరాసుల్లో కుటుంబ నియంత్రణపై అవగాహన లేకపోవడం జనాభా పెరుగుదలకు ఒక కారణమని అన్నారు. కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ ఇటువంటి ప్రాపంచిక విషయాలపై విద్యార్థులు దృష్టి పెట్టాలని, జిల్లా వైద్య శాఖకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గత వారం రోజులుగా పట్టణంలోని పలు కళాశాలలు, పాఠశాలల్లో జనాభా పెరుగుదల, నియంత్రణపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామని, గెలుపొందిన 26 మందికి ప్రభుత్వ ప్రశంసా పత్రాలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.అంజన్‌కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామ రాజు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వర్మ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలూరులో చోరీ

ప్రజాశక్తి - పోడూరు

గుమ్మలూరు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మలూరులో పిఎంపి డాక్టర్‌గా పనిచేస్తున్న ఇలపకుర్తి సూరిబాబు తన కుటుంబంతో కలిసి శనివారం అత్తవారి ఇంటికి అత్తిలి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి బీరువాలోని సామగ్రి చెల్లాచెరుదుగా పడి ఉండడం, నగదు, బంగారు, వెండి వస్తువులు అపహరణకు గురవ్వడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీటి విలువ దాదాపు రూ. పది లక్షలకు పైబడి ఉండొచ్చుని బాధితుడు చెబుతున్నాడు. నరసాపురం డిఎస్‌పి మనోహరచారి, ఎస్ఐ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు నిందితుల కోసం గాలిస్తున్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ముగిసిన బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి - తణుకురూరల్

ఈ నెల 14 నుండి 17వ తేదీ వరకు ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో శ్రీ చిట్టూరి సుబ్బారావు గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన చిట్టూరి సుబ్బారావు మెమోరియల్ జిల్లా బ్యాడ్మింటన్ సెలక్షన్ ఛాంపియన్‌షిప్ ఘనంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్యఅతిథిగా ఎస్‌కెఎస్‌డి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ వంశీకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కంటిపూడి రాంబాబు హాజరై బ్యాడ్మింటన్ సెలక్షన్ అండర్ 11, 13, 15, 17, 19 పురుషులు, మహిళలు, వెటరన్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అన్ని విభాగాల్లో తణుకు చిట్టూరి సుబ్బారావు, గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలవడం విశేషం. ఈ సందర్భంగా ఇటీవల భువనేశ్వర్ నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బంగారు పతకాలు సాధించిన సమ్మెట్ల హేమంత్‌శ్రీకి జిల్లా అసోసియేషన్ వారు రూ.10 వేల నగదు బహుమతి ఇచ్చి సత్కరించారు. కాంస్య పతకం సాధించిన దంతులూరి విజయతేజస్వినికి రూ.5 వేలు బహుమతి ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు సమ్మెట్ల సతీష్‌బాబు, యు.సుదర్శన్, ఎం.రత్నకుమారి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఉమ్మడి జిల్లా ఏలూరు మార్టేరులో ఆదివారం జరిగిన బాలికల, బాలుర సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పెద్దతాడేపల్లి భారతీయ విద్యా భవన్ స్కూల్ విద్యార్థులను సంస్థ ఛైర్మన్ చెరుకువాడ శ్రీ రంగనాధరాజు అభినందించారు. ఈ నెల 21 నుండి 23 వరకూ తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో జరగబోయే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలకు పశ్చిమగోదావరి జిల్లా తరపున వీరు పాల్గొంటారని తెలిపారు. అనంతరం విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపల్ రాజీవ్ కుమార్ శర్మ, స్కూల్ మేనేజ్మెంట్ సభ్యులు అభినందించారు.

అమాయకులకు అన్యాయం జరగకూడదు

ఘనంగా అంతర్జాతీయ న్యాయ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఒక్క అమాయకుడికీ అన్యాయం జరగకూడదనే సూత్రం న్యాయ వ్యవస్థకు పునాది అని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంవి.రమణ, పాకా రమేష్ అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్, జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలోని న్యాయదేవత విగ్రహం వద్ద అంతర్జాతీయ న్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ ఏర్పాటుకు గుర్తింపు చర్యగా ప్రతియేటా అంతర్జాతీయ న్యాయ దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మనం న్యాయాన్ని కాపాడితే న్యాయమే మనల్ని కాపాడుతుందని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐఎఎల్ జిల్లా అధ్యక్షులు చెల్లబోయిన రంగారావు, న్యాయవాదులు అడబాల శ్రీనివాస్, మోకా రాముడు, ఎం.కాస్ట్రో, వాసు గోపాలరావు, చెల్ల రాము, ఉండవల్లి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి ఉపాధ్యాయులకు జీతాలివ్వాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు ఇవ్వాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు కేడర్ స్ట్రెంగ్త్ నిర్ధారణ కాలేదనే నెపంతో జీతాలు చెల్లించకపోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్లస్ టూ జూనియర్ కళాశాలలుగా మార్పు చేసిన చోట పిజిటిలుగా (పిజిటి) ఉద్యోగోన్నతి కలిపించినా వారికి ఇంకా జీతాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1998 డిఎస్‌సి నుండి ఎంటిఎం ఉపాధ్యాయులుగా చేరిన వారికి గత ఏప్రిల్ నుంచి నేటి వరకూ జీతాలు చెల్లించలేదని తెలిపారు. కేడర్ స్ట్రెంగ్త్ సమస్యను పరిష్కరించి వారందరికీ వెంటనే జీతాలు చెల్లించాలని రాజగోపాల్ డిమాండ్ చేశారు.

కచ్చా డ్రెయిన్ పూడ్చివేతపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఉండి



వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గ్రామంలోని కచ్చా డ్రెయిన్ పూడ్చివేతపై తగు చర్యలు తీసుకోవాలని భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో, చిన్నపుల్లేరు పంచాయతీ కార్యదర్శికి చినపుల్లేరు శివారు తల్లమ్మచెరువు ప్రాంతవాసులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తలమ్మచెరువు దళితవాడకు చెందిన పలువురు మాట్లాడుతూ తమ ప్రాంతం నుంచి గ్రామంలోకి వెళ్లడానికి రోడ్డుకి ఇరువైపులా ఉన్న రైతులు సుమారు 12 లక్షల రూపాయలు వెచ్చించి గత నవంబర్‌లో గ్రావెల్ రహదారి వేయించారన్నారు. కచ్చా డ్రెయినేజీని తల్లమ్మ చెరువు ప్రాంతానికి చెందిన కుచ్చినపల్లి నిర్మలకుమారి, కోలనపల్లి శాంతమ్మ కొంతమంది గ్రామ పెద్దల ప్రోద్భలంతో డ్రెయినేజీ తూమును పూడ్చివేస్తున్నారని తెలిపారు. మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి దుర్వాసన వెదజల్లడమే కాకుండా రహదారి పూర్తిగా పాడైపోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పాలకవర్గానికి పలుమార్లు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోకపోవడంతో కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటికీ చర్యలు తీసుకోకపోతే తమ ప్రాంతంలోని దళితులందరూ కలిసి కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా తల్లమ్మ చెరువు ప్రాంతంలో కచ్చా డ్రైనేజీలు నిర్మించి సమస్య శాశ్వత పరిష్కారం చేయడానికి ఇంజినీరింగ్ అధికారులతో అంచనా వేయడం జరిగిందని, పంచాయతీ బోర్డు సమావేశంలో సమస్య పరిష్కారానికి తీర్మానం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

15 నాటికి అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు చెల్లించాలి

లేనిపక్షంలో అమరావతిని దిగ్బంధిస్తాం - అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు

భీమవరం: అగ్రిగోల్డ్ బాధితులందరికీ ఆగస్టు 15వ తేదీలోగా డిపాజిట్లు చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు కోరారు. లేనిపక్షంలో అగ్రిగోల్డ్ బాధితులతో కలిసి ఆగస్టు 30న అమరావతిని దిగ్బంధిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బాధితులు సోమవారం ఆర్‌టిసి డిపో వద్ద నుండి కలెక్టరేట్ వరకు అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించి కలెక్టర్ పి.ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు అగ్రి బాధితులకు రూ.250 కోట్లు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారన్నారు. ఆ సందర్భంలో బాధితులు చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష శిబిరాన్ని జగన్ సందర్శించి వైసిపి ప్రభుత్వం వచ్చిన వారంలోపు రూ.20 వేలలోపు డిపాజిటర్లకు రూ.1200 కోట్లు కేటాయించి న్యాయం చేస్తానని చెప్పారని, నాలుగేళ్లయినా పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. బాధితులకు కేవలం రూ.236 కోట్లు మాత్రమే జగన్ కేటాయించారని, అగ్రి బాధితులకు రావాల్సిన రూ.3851 కోట్లు ఆగస్టు 15వ తేదీలోగా బటన్ నొక్కి డబ్బు చెల్లించాలని, లేనిపక్షంలో ఆగస్టు 30న బాధితులు వారి కుటుంబ సభ్యులతో అమరావతిని ముట్టడిస్తారని ఆయన హెచ్చరించారు. జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు మాట్లాడగా అసోసియేషన్ భీమవరం గౌరవాధ్యక్షులు ఎం.సీతారాంప్రసాద్, పట్టణ కార్యదర్శి కె.గోపాలకృష్ణ, సిపిఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, గణపతి, రమణశ్రీను, ఎన్.పుల్లయ్య, ఐవి.సత్యనారాయణ, వెం కటేశ్వరరావు, రామారావు, సంతోష్, రజని, అన్నపూర్ణ, శ్రీదేవి, గంగలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీకాంతం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఒ టికెవి.లక్ష్మీకాంతం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు సంబంధించి కోడ్ నెంబర్ 0518200 దుర్గాపురం - 1 (ఓసి), కోడ్ నెంబర్ 184 జగన్నాథరావుపేట (ఓసి) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అలాగే అంగన్వాడీ సహాయకులకు సంబంధించి కోడ్ నెంబర్ 199 లంకపేట - 1 (ఓసి), కోడ్ నెంబర్ 67 రాయలం -1 (ఎస్‌సి), కోడ్ నెంబర్ 173 నరసన్న చెరువుపాలెం (ఓసి), కోడ్ నెంబర్ 241 ముస్లిం స్ట్రీట్ (ఓసి), కోడ్ నెంబర్ 233 నెహ్రూ కాలనీ (ఎస్‌సి) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. స్థానికులై వివాహమైన మహిళలకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల వయసు 35 సంవత్సరాలు నిండి ఉండాలని పేర్కొన్నారు. కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. జులై 17 నుంచి 24వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా విద్యార్హత, కుల, నివాస, పుట్టిన తేదీ, అంగవైకల్యం, భర్త చనిపోతే మరణ ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుతో పాటు జత చేయాలని పేర్కొన్నారు.

ఆచంట : మండలంలో రెండు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పోడూరు ఇన్‌ఛార్జి సిడిపిఒ ఎం.విజయకుమారి సోమవారం విలేకరులకు తెలిపారు. ఆచంట పంచాయతీ పరిధి గొల్లపల్లివారి చెరువుకు చెందిన కోడ్ నంబర్ 82లో ఎస్‌సి, ఆచంట వేమవరం మహిళా మండలి కోడ్ నంబర్ 88లో బిసికి చెందిన అంగన్‌వాడీ సహాయక పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఆకివీడు : స్థానిక అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో రెండు కార్యకర్తల స్థానాలు, ఐదు కేంద్రాల్లో సహాయకుల స్థానాలు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్ట్ అధికారి బి.వాణి విజయరత్నం కోరారు. కాళ్ల మండలం వేంపాడు గ్రామంలో ఖాళీగా ఉన్న కార్యకర్త స్థానాన్ని బిసిబికి రిజర్వ్ చేశారని తెలిపారు. పాలకోడేరు మండలం కుముదవల్లి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త స్థానం ఖాళీగా ఉందని ఈ స్థానానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇక సహాయకుల 5 స్థానాల్లో దుంపగడప శివారు పల్లెపాలెం బిసిఎకు, పాలకోడేరు మండలం పెన్నాడ బిసిడికి, కాళ్ల మూడో కేంద్రం ఎస్‌కికు రిజర్వ్ అయినట్లు తెలిపారు.

ఇసుక తరలింపుదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడులో వాటర్ ట్యాంకు ఫిల్టర్ బెడ్‌కు వినియోగించిన ఇసుక అక్రమంగా దారి మల్లుతోందని, వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని టిడిపి నాయకులు బొల్ల వెంకట్రావు, జనసేన కౌన్సిలర్లు విమర్శించారు. సోమవారం స్థానిక భుజబలరాయుడు చెరువుగట్టు శాండ్ ఫిల్టర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భుజబల రాయుడు తాగునీటి చెరువు వద్ద, తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న వాటర్ ట్యాంకుల్లోని ఫిల్టర్లలో ఒకసారి వినియోగించిన ఇసుకను కౌన్సిల్ అనుమతి లేకుండా దారి మళిస్తున్నారని ఆరోపించారు. ఈ ఇసుక నగర పంచాయతీకి ఆదాయం తెచ్చిపెడుతోందని, ఆ ఆదాయానికి గండి కొడుతున్నారని తెలిపారు. వెంటనే ఇసుక అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి కౌన్సిలర్లు బి.వీరశ్విత, నేరెళ్ల ప్రసన్న, బత్తుల శ్యామల, కె.అరుణకుమారి పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పోడూరు

కవిటం శివారు నల్లవెంకయ్య చెరువు గ్రామంలో మురుగునీటి సమస్యను ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌సి కాలనీ వాసులు ఆయన వద్ద గోడు వెల్లబోసుకున్నారు. 1978లో కాలనీ ఏర్పడిందని, దాదాపు 500 కుటుంబాలు నివసిస్తున్నామని, కాలనీ ఏర్పడినప్పటి నుంచి ఇళ్లలోని మురుగునీరు సమీపంలోని బోదెల్లోకి వెళ్లేదని తెలిపారు. తమ ప్రాంతంలో మురుగు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లు మురుగునీటితో నిండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పంచాయతీ వారికి వివరించగా ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని చెప్పారని తెలిపారు. అనంతరం కాలనీలో మురుగు సమస్యను ఎంఎల్‌ఎ పరిశీలించారు. కాలనీలోని మురుగునీరంతా పోడూరు పుంతలోని మురుగుబోదెలోకి వెళ్లేలా కచ్చా డ్రెయిన్ తవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్, తహశీల్దార్ ఆర్‌వి కృష్ణారావు, సొసైటీ ఛైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

టిడిపిది దొంగల ముఠా బస్సుయాత్ర : మంత్రి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

టిడిపి చేపట్టిన బస్సు యాత్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ కాదని, అది టిడిపి దొంగల ముఠా బస్సు యాత్ర అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. ప్రజల భవిష్యత్తుకు జగనన్న గ్యారెంటీ ఉన్నారన్నారు. చంద్రబాబు భవిష్యత్తు ఏంటి అనేది చంద్రబాబు ఆలోచించుకోవాలన్నారు. తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం గ్రామంలో సోమవారం రాత్రి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల్లో ఉన్న వాస్తవ పరిస్థితిని చూసి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. బస్సులో వచ్చేవాళ్లందరూ ఒక్కొక్కరికి ఒక్కో ఘన చరిత్ర ఉందన్నారు. అందులో టిడిపి దొంగల ముఠా వస్తుందన్నారు. చంద్రబాబు ఇంటికి కేజీ బంగారం ఇస్తానన్నా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. నువ్వు, పవన్ కళ్యాణ్ ఉండేది హైదరాబాద్‌లో చుట్టం చూపుగా వస్తారని తెలిపారు. మంచి పరిపాలన అందిస్తున్న జగన్‌ను సంక్షేమ పథకాలను చూసి ప్రజలు వైకాపాకు ఓటు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి ముప్పిడి సంపత్ కుమార్, వైసిపి మండల అధ్యక్షులు వెలిశెట్టి నరేంద్ర కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా ఆక్వా చెరువుల తవ్వకాలేమిటీ

ఆక్సిజన్‌ప్లాంట్ నిర్మాణంపై ప్రజాభిప్రాయం పట్టించుకోరా
కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన కదంతొక్కిన బాధితులు

ఏలూరు అర్బన్: జిల్లాలోని కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి, ఏలూరు మండలాల్లో అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలు, ప్రజాభిప్రాయానికి భిన్నంగా కైకలూరు మండలం నర్సాయపాలెంలో ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం తక్షణం ఆపాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బాధిత ప్రజలు కదం తొక్కారు. తమకు న్యాయం చేయాలంటూ నినదిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి ఫ్ల కార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ధర్నా నుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.ఎన్.వి.డి ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళి రావు, నర్సాయపాలెం గ్రామ సర్పంచ్ కె.రాధాకష్ణ, సీతారాంపురం అగ్రహారం గ్రామ సర్పంచ్ పర్సా వెంకటస్వామి, కానుకొల్లు ఆక్వా చెరువులు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు ఎల్లమెల్లి మరియరాజు మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా యదేచ్ఛగా, అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. మండవల్లి మండలం కానుకొల్లులో, కలిదిండి మండలం సీతారామపురం అగ్రహారంలో, కొండంగిలో, సానారుద్రవరంలో, ముదినేపల్లి మండలం దేవపూడి, ఊటుకూరు తదితర గ్రామాల్లో ప్రజల ఆవాసాలు, తాగునీటి చెరువులు, బావులు, పంటచేల మధ్య ఎటువంటి అనుమతులూ లేకుండా అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నారని చెప్పారు. ఇదేకాకుండా నియోజకవర్గమంతటా పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గిపోయి ఉపాధి కరువై, తాగునీరు కలుషితమై కిడ్నీల్లో రాళ్లు, కేన్సర్ వంటి రోగాలబారిన పడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటచేలు చౌడుబారిపోతున్నాయని పేద, కౌలు రైతులు వాపోతున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రజాభిప్రాయాలకు భిన్నంగా కైకలూరు మండలం పల్లెవాడ రెవెన్యూ నర్సాయపాలెంలో ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మిస్తున్నారని అన్నారు. అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో గ్రామస్తులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించినా అనుమతులు మంజూరు చేయడం దారుణమన్నారు. కొల్లేరు ఐదో కాంటూరు పరిధిలో తాగునీటి చెరువు, జగనన్న ఇళ్ల కాలనీకి చేర్చి నిర్మిస్తున్న ఈ ప్లాంట్ ప్రజారోగ్యానికి, పర్యావరణానికి చేటు కల్గిస్తుందన్నారు. ప్రజల ఆవాసాలకు దూరంగా నిర్మించుకోవాలని కోరారు. ప్లాంట్ వ్యర్థాలు, తాగునీటి చెరువులోకి, గ్రామంలోకి చేరి తమ ప్రాణాలకు హాని కలుగుతుందని వాపోతున్నా ఏకపక్షంగా పనులు చేస్తున్నారని వివరించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు సిపిఎం నాయకులు, బాధిత ప్రజలు వినతిపత్రాలు అందజేశారు.

'టిడిపి గెలుపునకు కృషి చేయాలి'

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంఎల్‌సి టి.దశరథ జనార్ధన్, పశ్చిమ గోదావరి జిల్లా జెడ్‌పి మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, పుత్తూరు ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్, చిత్తూరు పార్లమెంట్ ప్రెసిడెంట్ పులివర్తి నాని (చంద్రగిరి) అన్నారు. అమెరికా చార్లెట్ నార్త్ కరోలినా టిడిపి అభిమానుల ఆధ్వర్యంలో టిడిపి మీట్ విత్ గ్రేట్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. నర్సాపురం నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకలో జనార్దన్, బాపిరాజు, ప్రకాష్, నానీ ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడారు. ఎన్‌టిఆర్, చంద్రబాబు తీసుకొచ్చిన ప్రభుత్వ పథకాలు, ఇంజినీరింగ్ కళాశాలల వల్ల బాగా చదువుకొని ఎంతో మంది అమెరికా వంటి దేశాల్లో స్థిరపడ్డారన్నారు. ఎన్‌టిఆర్ సినీ జీవితంలో కాదు నిజ జీవితంలో కూడా హీరో అని తెలిపారు. టిడిపిని 2024లో తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి, చంద్రబాబును మరలా ముఖ్యమంత్రిగా శాసనసభలో తిరిగి కాలు పెట్టించాలన్నారు. దీనికి ఎన్నారైలు నడుము కట్టాలని తెలిపారు.

వారాహి యాత్రకు విశేష స్పందన

ప్రజాశక్తి - తణుకు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టిన వారాహి యాత్రకు విశేష స్పందన వచ్చిందని పార్టీ తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు చెప్పారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్రను విజయవంతం చేసిన జన సైనికులకు, వీర మహిళలకు, అభిమానులకు, ప్రజలకు అధికారులకు అనధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా బహిరంగ సభలో తణుకు సమస్యలపై ఎక్కువగా మాట్లాడారన్నారు. పవన్ ఏం మాట్లాడారో స్థానిక మంత్రికి అర్థం కావడం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పవన్ కళ్యాణ్ వస్తున్నారని తెలిసి పట్టణంలో భారీ ఫ్లెక్సీలు ఎందుకు కట్టించారన్నారు. పవనకు వచ్చిన స్పందన చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు కొమ్మిరెడ్డి శ్రీనివాస్, తణుకు, ఇరగవరం మండలాల అధ్యక్షులు చిక్కాల వేణు ఆకేటి కాశీ, పట్టణ యూత్ అధ్యక్షుడు గర్రె తులసీరామ్, జిల్లా సెక్రటరీ తమరాపు నరసింహారావు పాల్గొన్నారు.

'పితానికి కుల రాజకీయాలు తగవు'

ప్రజాశక్తి - ఆచంట

కులాలను అడ్డు పెట్టుకుని రాజకీయంగా లబ్ధి పొంది, కులపరంగా వెలివేసిన ఘనత మాజీ మంత్రి పితాని సత్యనారాయణకే దక్కిందని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ విమర్శించారు. సోమవారం సాయంత్రం ఎఎంసి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెనుగొండ మండలం నడిపూడి శివారు మిద్దేవారిపాలెంలో ఎస్‌సికి చెందిన 12 కుటుంబాలను స్థానిక బిసి సంఘం వెలివేసినట్లు తెలిపారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆదివారం మార్టేరులో జరిగిన టిడిపి సభలో పితాని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు వెలి కేసులు పెట్టారని ఆరోపించారని తెలిపారు. ఎంఎల్‌ఎపై అవాకులూ, చవాకులు పేలితే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, పెనుగొండ, పెనుమంట్ర ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు పలివెల శ్రీను, బుర్రా రవికుమార్, నేతలు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - పాలకోడేరు

పెనుమంట్ర హెడ్ కానిస్టేబుల్ పాలా వరప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో జిల్లాలోని సహచర సిబ్బంది వరప్రసాద్ కుటుంబానికి చేయూత అందించే విధంగా రూ.2 లక్షల 16 వేలు సిబ్బంది నుంచి వసూలు చేసి ఆ మొత్తాన్ని ఎస్‌పికి అందజేశారు. దీనిలో భాగంగా జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ సోమవారం వరప్రసాద్ స్వగ్రామమైన వేంద్ర వెళ్లి అతని కుటుంబ సభ్యులను ఓదార్చి ఆ మొత్తాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వరప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట యూనియన్ పోలీస్ నాయకుడు సిహెచ్ మోజేస్, ఎఎస్ఐ దాలియ్య, ఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్‌కానిస్టేబుళ్లు రాము, అలెగ్జాండర్లు ఉన్నారు.

డాక్యుమెంటు పోయినది

వట్లూరు గ్రామం, పెదపాడు మండలంకు చెందిన **మలిశెట్టి కస్తూరి, భర్త: నారాయణ రావు** గారి ఖాళీ స్థలముకు సంబంధించిన డాక్యుమెంటు ఏలూరు పాత బస్టాండుకు కొత్త బస్టాండుకు మధ్య ఎక్కడో పోగొట్టుకొనుట జరిగినది. స్థలము 35 గజములు విస్తీర్ణము, సర్వే నెం. 458/16 ఈ డాక్యుమెంటు దొరికిన వారు దయచేసి అందజేయగలరు. తగిన పారితోషకము ఇవ్వబడును.

సెల్: 97039 70211

డాక్యుమెంటు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కైకరం గ్రామ నివాసి 1వ వార్డుకు చెందిన శానం సూరిబాబు గారి కుమారుడు లక్ష్మణరావు అను నేను మా ఇంటి స్థలంకు సంబంధించి కైకరం నుండి ఉంగుటూరుకు మోటారు సైకిల్ పై వెళుతుండగా పడిపోయినది. సదరు డాక్యుమెంటు భీమడోలు రిజిస్ట్రీ డాక్యుమెంటు నెం. 10249/2017 ఎవరికైనా దొరికిన ఎడల ఈ దిగువ నెంబరుకు తెలియపరచగలరు. స్థలం ఆర్.ఎస్.నెం. 156/4ఏ, చ॥గ॥171లు అనగా 143 చ॥మీ॥లు.

గుత్తికొండ శ్రీనివాసరావు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
సెల్: 98480 50089